సాక్షి
వైఎస్సార్ జిల్లా
శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025



ముంచుకొస్తున్న ముంపు జలాలు

పెన్నా ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో.. సోమశిల జలాశయంలో నీరు పెరుగుతోంది. అట్లూరు మండల పరిధిలోని నగిలేరుకి భారీగా జలాలు వస్తున్నాయి. -8లో



ఉత్సాహంగా క్రికెట్ మ్యాచ్‌లు

ఏసీఏ అండర్-23 మల్టీ డే మ్యాచ్‌లు రెండవ రోజు ఉత్సాహంగా కొనసాగాయి. కడప జట్టు 9 వికెట్లు కోల్పోయి 374 పరుగులు చేసింది. -8లో

గరిష్టం/కనిష్టం
33.2/25.2

వాతావరణం

జిల్లాలో గురువారం 25.2 - 33.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రేపు 5కే రెడ్ రన్ మారథాన్

కడప రూరల్: కడప నగరంలో ఈ నెల 6న 5కే రెడ్ రన్ మారథాన్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. శనివారం ఉదయం 5.30 గంటలకు స్థానిక మహవీర్ సర్కిల్ నుంచి రిమ్స్ బ్రిడ్జి వరకు అక్కడి నుంచి మహవీర్ సర్కిల్ వరకు మారథాన్ ఉంటుందన్నారు. వివరాలకు సెల్ నంబరు 9866094531, 9052038569 ను సంప్రదించాలని సూచించారు.

7న బాల్‌బ్యాడ్మింటన్ జూనియర్ జట్ల ఎంపిక

ప్రొద్దుటూరు కల్చరల్: జమ్మలమడుగు మండలం ఎస్.ఉప్పలపాడు జెడ్పీ హైస్కూల్ మైదానంలో ఈనెల 7న ఉమ్మడి కడప (వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల) జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ జూనియర్ బాలబాలికల జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.కృష్ణమూర్తి, కార్యదర్శి జి.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 94901 81104, 7036907303 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ

చింతకొమ్మదిన్నె: జిల్లా పరిషత్ సీఈఓ సి.ఓబులమ్మ స్థానిక చింతకొమ్మదిన్నె ఎంపీడీఓ కార్యాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. కార్యాలయ పరిసరాలను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. జెడ్పీ పరిధిలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం అవసరమైన పనులకు, నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాల్సిందిగా ఎంపీడీఓ కార్యాలయ అధికారులకు జెడ్పీ సీఈఓ ఓబులమ్మ సూచించారు.

పవిత్రోత్సవాలు ప్రారంభం

కడప సెవెన్‌రోడ్స్: దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం సాయంత్రం నుంచి పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. నాలుగు రోజులపాటు టీటీడీ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాల్లో భాగంగా తొలి రోజు అర్చకులు శాస్త్రోక్తంగా అంకురార్పణ, మృత్సంగ్రహణం, విశ్వక్సేన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అర్చకులు మయూరం కృష్ణమోహన్, త్రివిక్రమ్, కృష్ణతరుణ్ ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్ఈ రమణ

కడప కార్పొరేషన్: ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యతను పెంచడంపై అధికారులు దృష్టి సారించాలని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ యస్.రమణ అన్నారు. గురువారం విద్యుత్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, సమస్య మూలకారణాన్ని గుర్తించి సమగ్ర పరిష్కారం అందించాలన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మధుసూదన్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోహన్, డిస్ట్రిక్ట్ కంట్రోల్ రూమ్ కోఆర్డినేటర్ మంజూష, జిల్లాలోని ఏఈలు, జేఈలు పాల్గొన్నారు.

నారా ద్వయం.. బూరే నయం

'నారా'వారు తమ మాటలతో జిల్లా ప్రజల్లో నవ్వుల పాలవుతున్నారా? అంటే అవుననే సమాధానమే వస్తోంది. చేయని పనులను చేశామని గొప్పలు చెప్పడం.. పట్టపగలే పచ్చి అబద్ధాలను వండి వార్చడం.. ఆ ఇద్దరికే చెల్లింది. సొమ్ము ఒకరు ఖర్చు చేస్తే.. సోకులు పోవడం వారికి అలవాటుగా మారింది. సీఎం హోదాలో నారా చంద్రబాబు.. మంత్రిగా నారా లోకేష్.. మైకు చేతికం దినప్పుడల్లా అసత్యాలు వల్లెవేస్తున్నారు. సొంతగడ్డపై మమకారంతో 'వైఎస్' ఫ్యామిలీ అభివృద్ధికి బీజం వేస్తే.. వీరేమో అంతా తామే చేశామంటూ ఫొటోలకు ఫోజులతో 'కటింగులు' ఇస్తున్నారు.

- నాడు.. సీఎం చంద్రబాబు కడప కలెక్టరేట్ ప్రారంభం
- నేడు.. మంత్రి లోకేష్ కొప్పర్తి ఇండస్ట్రియల్ హబ్ ప్రారంభం
- వైఎస్సార్, వైఎస్ జగన్ చేసిన అభివృద్ధి పనులకు రిబ్బన్ కటింగ్
- దానికే గొప్పలు పోతున్న 'తమ్ముళ్లు'
- జిల్లాలో నిర్దిష్ట అభివృద్ధి లేకపోగా గొప్పలకు తిప్పలు



సాక్షి ప్రతినిధి, కడప: కడప.. ఈ పేరు వింటేనే నారా వారికి కడుపు మంట. ఒకటా రెండా 15ఏళ్ల సీఎంగా పని చేసిన నారా చంద్రబాబు నాయుడు జిల్లాలో నిర్దిష్టమైన అభివృద్ధి చేయకపోగా.. అవకాశం వచ్చినప్పుడల్లా వివక్ష చూపించారు. స్వయంగా ముఖ్యమంత్రి హోదాలో ఏదైనా అభివృద్ధి పనికో.. ప్రాజెక్టుకో శంకుస్థాపన చేసి ప్రారంభించిన చరిత్ర బాబుకు లేదు. అలాంటిది వైఎస్సార్ కడప జిల్లాలో తమ హయాంలోనే అభివృద్ధి చేస్తున్నామని సీఎం చంద్రబాబు..మంత్రి నారా లోకేష్ గొప్పగా చెప్పడం హాస్యాస్పదంగా మారింది. నాడు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కలెక్టరేట్ కాంప్లెక్స్‌కు నిధులిచ్చి పనులు ప్రారంభిస్తే, తర్వాత సీఎం హోదాలో చంద్రబాబు ప్రారంభించారు. అదే జాబితాలో పైడిపాళెం రిజర్వాయర్, ఎయిర్‌పోర్టు కూడా ఉన్నాయి. ఇక నారా లోకేష్ కూడా అచ్చం తండ్రి అడుగుజాడల్లోనే నడుస్తున్నారు. తాజాగా కొప్పర్తి ఇండస్ట్రియల్ హబ్ ఉత్పత్తులు ప్రారంభించిన మంత్రి నారా లోకేష్ తమ హయాంలోనే చేశామని అబద్ధాలు వండివారుస్తున్నారు. వైఎస్ కుటుంబం జిల్లాలో నిర్దిష్టమైన అభివృద్ధి కోసం విశేషంగా పనిచేస్తే, 'నారా ద్వయం' రిబ్బన్ కటింగ్‌కు మాత్రమే పరిమితమై జిల్లా వాసుల్లో నవ్వులపాలవుతున్నారు.

- కడప గడపలో 2004-09 మధ్య కాలంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో నిధుల వరద పారింది. విద్య, వైద్యం, వ్యవసాయం, మౌళిక వసతులు, పారిశ్రామిక ప్రగతి ఇలా అన్నీ రంగాల్లో జిల్లా అభివృద్ధి పరుగులు తీసింది. తర్వాత 2019-24లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అభివృద్ధి ముద్ర పడింది. జిల్లాలో పారిశ్రామిక ప్రగతి పరుగులు పెట్టింది. సెంచరీ ప్లైబోర్డ్స్ పరిశ్రమ కారణంగా దాదాపు 2వేల మంది స్థానికులకు ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు దక్కాయి. కొప్పర్తి ఇండస్ట్రియల్ హబ్ వల్ల దాదాపు 8వేల మంది నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దక్కాయి. మరోవైపు చెన్నై-విశాఖ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా కొప్పర్తిని చేర్చి స్మార్ట్ సిటీగా రూ.2,147కోట్లు పెట్టుబడులకు మార్గదర్శకుడిగా నిలిచారు. తద్వారా 54వేల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ ఉపాధి లభించేలా ప్రణాళికలు చేశారు. అసలు కొప్పర్తి పారిశ్రామికవాడ రూపకల్పన చేసిందే దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. 6వేల ఎకరాల్లో కొప్పర్తి పారిశ్రామికవాడ ఏర్పాటు చేశారు. సీఎం హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ పారిశ్రామికవాడకు మౌళిక సదుపాయాలు కల్పించారు. పైగా అందులో డాక్టర్ వైఎస్సార్ ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చర్ క్లస్టర్ కూడా నెలకొల్పారు. వైఎస్సార్ ఈఎంసీలో రూ.10వేల కోట్లు పెట్టుబడులు, దాదాపు లక్ష మందికి ఉద్యోగాలకు ప్రణాళికలు చేశారు. ఇదివరకే ఏఐఎల్ డిక్సన్ టెక్నాలజీస్ సంస్థ ఉత్పత్తి ప్రారంభించింది. ఈ సంస్థ ద్వారా ప్రత్యక్షంగా 1300 మందికి ఉద్యోగాలు లభించాయి. చంద్రబాబు చరిత్రలో జిల్లాకు ఒక్క పరిశ్రమ కూడా వచ్చింది లేదు.

నాడు కలెక్టరేట్‌ను ప్రారంభించిన చంద్రబాబు...

ముఖ్యమంత్రి హోదాలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కడప నగర ద్విశతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆ తర్వాత కొత్త కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 2008 మే 8న జీఓ ఎంఎస్ నెం.140 ద్వారా రూ.67.3 కోట్లు అడ్మినిస్ట్రేషన్ శాంక్షన్ అప్రూవల్ ఇచ్చారు. 2008 మే 22న శంకుస్థాపన చేశారు. ఆ పనులు పూర్తయిన తర్వాత 2016 ఏప్రిల్ 20న సీఎం హోదాలో నారా చంద్రబాబు నాయుడు నూతన కలెక్టరేట్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. అలాగే కడప ఎయిర్‌పోర్టు, పైడిపాళెం ప్రాజెక్టు కూడా అలాగే చేశారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన పనులకు రిబ్బన్ కటింగ్ చేసి తామే చేశామని చెప్పుకునేందుకు తిప్పలు పడ్డారని పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

అదేబాటలో నారా లోకేష్...

కొప్పర్తి ఇండస్ట్రియల్ హబ్ ఉత్పత్తులను ప్రారంభించి తమ వల్లే పారిశ్రామిక ప్రగతి సాధ్యమని చెప్పుకునేందుకు ఓవైపు మంత్రి నారా లోకేష్ మరోవైపు జిల్లాకు చెందిన తెలుగుతమ్ముళ్లు తిప్పలు పడుతున్నారని పరిశీలకులు భావిస్తున్నారు. జిల్లాకు ప్రత్యేకించి నిధులు కేటాయించడం లేదా నిర్దిష్ట అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు రచించడం వంటివి ఏమి లేదని జిల్లా వాసులు మండిపడుతున్నారు. జిల్లాపై.. ఇక్కడి అభివృద్ధిపై తెలుగు తమ్ముళ్లకు చిత్తశుద్ధి లేదని నిరూపితమవుతోంది. మహానాడు తమ నియోజకవర్గంలోనే నిర్వహించాలని పోటీ పడ్డ తెలుగుతమ్ముళ్లు సర్వారాయసాగర్, వామికొండ, గండికోట ప్రాజెక్టుల పరిధిలో డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మాణానికి నిధులకు డిమాండ్ చేయకపోవడం విడ్డూరంగా ఉందని, అలాంటి ధ్యాసే లేదని విశ్లేషకుల మాట.

రైతు సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం

- ఈనెల 9న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ
- మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా , చిత్రంలో మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: రైతుల సమస్యలపై కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ధ్వజమెత్తారు. గురువారం సాయంత్రం మాజీ డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అన్నదాత సుఖీభవ కింద కేంద్రంతో సంబంధం లేకుండా రూ.20వేలు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక మాట మార్చి మొదటి ఏడాది ఎగ్గొట్టిందని, రెండో ఏడాది రూ.5వేలు మాత్రమే ఇచ్చిందని తెలిపారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక అల్లాడిపోతున్నారని, చీని, మినుము, మిర్చి, ఉల్లి పంటలకు గిట్టుబాటు ధర లేదన్నారు. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచాల్సిన ప్రభుత్వం, ప్రణాళిక లేకుండా వ్యవహరించిందన్నారు. ఆడలేక మద్దెల ఓడు అన్నట్లు రైతులకు యూరియాను అందుబాటులో ఉంచలేక, యూరియా ఎక్కువ వాడితే కేన్సర్ వస్తుందని సీఎం చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఈ సమస్యలన్నింటిపై ప్రత్యక్ష పోరాటం చేయాలని వైఎస్సార్‌సీపీ నిర్ణయించిందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు జయప్రదం చేయాలని కోరారు. జయచంద్రారెడ్డి, బీహెచ్ ఇలియాస్, బంగారు నాగయ్య, బసవరాజు, అరీఫుల్లా బాషా, కె. బాబు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేసీ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్: ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను నిర్దేశిత లక్ష్యం మేరకు పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో పలు అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచికలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరితోపాటు జేసీ అదితి సింగ్ హాజరయ్యారు. వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను నిర్దేశిత లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. ఈ విషయంలో అన్ని శాఖల జిల్లా అధికారులు క్షేత్ర స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు.

పకడ్బందీగా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పరీక్షలు

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఉద్యోగాల కోసం ఆదివారం జిల్లాలో నిర్వహించనున్న స్క్రీనింగ్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఏపీ ఫారెస్ట్ సబార్డినేట్ సర్వీసెస్‌కు సంబంధించి ఈ నెల 7న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాలు భర్తీ కోసం ఆఫ్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఉద్యోగాల ఆఫ్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష మధ్యాహ్నం 3.00 నుంచి 5.30 గంటల వరకు నిర్వహించనున్నామన్నారు.

- పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల సహాయార్థం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు 08562- 246344 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చునని తెలిపారు.

రైతులను నట్టేట ముంచిన ప్రభుత్వం

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల: రాష్ట్రంలోని రైతన్నలను అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం నట్టేట ముంచిందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం పులివెందులలోని తన స్వగృహంలో ఆయన మాట్లాడుతూ వరి ఎక్కువగా పండించవద్దని సీఎం చంద్రబాబు చెప్పడం సిగ్గు చేటన్నారు. రైతులకు అవసరమైన యూరియాను అందించకుండా వరి పంట పండించవద్దని, యూరియా ఎక్కువ వాడితే క్యాన్సర్‌కు దారి తీస్తుందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పక్కదారి పడుతున్న యూరియాను అరికట్టాల్సిన ప్రభుత్వం కళ్లు మూసుకుందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆర్‌బీకేల ద్వారా 12లక్షల టన్నుల ఎరువులను రైతులకు అందజేశామని వివరించారు. ఉల్లి ధరలు కూడా పతనమైనప్పుడు తమ ప్రభుత్వ హయాంలో గిట్టుబాటు ధర కల్పించి రైతుల వద్ద దాదాపు 9వేల టన్నులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. అనంతరం ఆయన ప్రజా దర్బార్ నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ప్రభుత్వాసుపత్రిని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

గురువారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పులివెందులలోని స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు పద్మనాభరెడ్డి సోదరుడు నాగేశ్వరరెడ్డిని ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న వైద్యురాలితో నాగేశ్వరరెడ్డి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అలాగే వైద్యురాలితో సిటి స్కాన్ పరికరాలు, ఇతర సదుపాయాలపై ప్రశ్నించగా సిటి స్కాన్ ఉన్నప్పటికి సిబ్బందిలేరని బదులిచ్చారు. దీనికి స్పందించిన ఎంపీ ఈ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై కూడా కక్ష సాధిస్తోందని, పులివెందుల మెడికల్ కళాశాలకు మంజూరైన 50 మెడికల్ సీట్లను తిరస్కరించడం అందుకు నిదర్శనమన్నారు.

సేవలకు సత్కారం



- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా 60 మంది ఎంపిక
- నేడు కలెక్టరేట్ సభాభవనంలో అవార్డులు ప్రదానం

కడప ఎడ్యుకేషన్: అజ్ఞానం నుంచి విజ్ఞానం వైపు అడుగులు వేయించి విద్యార్థుల బంగరు భవితకు బాటలు వేసే మహోన్నత వ్యక్తులు అయ్యవార్లు. ఏటా సెప్టెంబర్ 5వ తేదీన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలలో పనిచేస్తున్న 60 మంది ఉపాధ్యాయులను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేశారు. వీరందరికి శుక్రవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ సభాభవన్‌లో అవార్డులను ప్రదానం చేసి సన్మానం చేయనున్నట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ చెరుకూరు శ్రీధర్‌తోపాటు పలువురు ప్రజా ప్రతినిధులు హాజరై అవార్డులను అందచేయనున్నట్లు డీఈఓ తెలిపారు.

స్కూల్ అసిస్టెంట్ కేటగిరీకి సంబంధించి...

మండలం	స్కూల్ అసిస్టెంట్ పేరు, పనిచేసే చోటు
ముద్దనూరు	రవిశంకర్ జెడ్పీహైస్కూల్, రాజులగురువాయిపల్లె
చక్రాయపేట	ఎరికలరెడ్డి, జెడ్పీ హైస్కూల్, మహదేవపల్లి
ఎర్రగుంట్ల	సావిత్రమ్మ, జెడ్పీ హైస్కూల్, చిలంకూరు
కొండాపురం	మహాలక్ష్మి, జెడ్పీహైస్కూల్ తాళ్ల పొద్దుటూరు
సింహాద్రిపురం	పద్మనాభరెడ్డి జెడ్పీహైస్కూల్, సింహాద్రిపురం
కొండాపురం	నాగక్రిష్ణారెడ్డి జెడ్పీ హైస్కూల్, బెదురూరు
కడప	సయ్యద్ నూర్, ఎంపీయూపీఎస్, సిద్ధిక్‌నగర్
పోరుమామిళ్ల	జనార్థన్, ఎంపీపీఎస్, ఈడుగపల్లి
సికెదిన్నె	ఈస్తర్ సుకుమారి, జెడ్పీహైస్కూల్, అంగడివీధి
కాశినాయన	బీవీ సుబ్బారెడ్డి, జెడ్పీహైస్కూల్, నరసాపురం
బద్వేల్	శివప్రసాద్, జెడ్పీహైస్కూల్ బాయిస్, బద్వేల్
పులివెందుల	భార్గవి ప్రియదర్శిని, జెడ్పీహైస్కూల్ గర్ల్స్, పులివెందుల
ఎర్రగుంట్ల	పీఆర్ మంజులదేవి, జెడ్పీహైస్కూల్, ఎర్రగుంట్ల
పొద్దుటూరు	వీవీ గాయత్రి ఎస్‌కేసివిఎస్, ఎయిడెడ్ స్కూల్
పులివెందుల	ఎస్ఆర్‌వీ ప్రసాద్‌రెడ్డి, జెడ్పీహైస్కూల్ పెద్దరంగాపురం
పులివెందుల	సుధాకర్‌రెడ్డి జెడ్పీహైస్కూల్ ఉర్దూ, ఇస్లాంపురం
వేంపల్లి	ఫిరోజ్ జాన్, జెడ్పీహైస్కూల్, వేంపల్లి
బద్వేల్	ఓబయ్య, జెడ్పీహైస్కూల్ బాయిస్, బద్వేల్
కడప	అరుణకుమారి, జెడ్పీహైస్కూల్, రామరాజుపల్లె
బిమఠం	గురవయ్య, జెడ్పీ హైస్కూల్, మల్లేపల్లి
ఎర్రగుంట్ల	ఎస్‌ఏ చాంద్‌బాషా జెడ్పీహైస్కూల్‌బాయిస్, ఎర్రగుంట్ల
జమ్మలమడుగు	సుబ్రమణ్యం, జెడ్పీహైస్కూల్, దేవగుడి
వల్లూరు	శ్రీ దీపా రెడ్డి, ఏపిఎంఎస్, వల్లూరు
కడప	దాది నాగరాజు ఎంపీపీఎస్,8వార్డు, సాయిపేట, కడప
భారత్ స్కౌట్ అండ్ గైడ్స్..	
చెన్నూరు	వెంకటసుబ్బయ్య, జెడ్పీ బాయిస్, చెన్నూరు

గ్రేడ్-2 హెచ్‌ఎంలు..

మండలం	గ్రేడ్-2 హెచ్‌ఎం పేరు, పనిచేసే చోటు
కలసపాడు	మెర్సీ మిలానీ, జెడ్పీహైస్కూల్, ఎగువరామపురం
మైదుకూరు	విజయ(ప్రిన్సిపాల్), కేజీబీవీ, మైదుకూరు
వేముల	కేవీ నాగిరెడ్డి, జెడ్పీహైస్కూల్, వేముల
సికెదిన్నె	సరస్వతి, జెడ్పీహైస్కూల్(ఉర్దూ) , మూలవంక
కడప	నాగమణి, ఎంపిసిహెచ్ఎస్, గాంధీనగర్ , కడప
జమ్మలమడుగు	రామక్రిష్ణమ్మ, జెడ్పీహైస్కూల్ మిఠాయిగిరి ఉర్దూ
సిద్దవటం	లక్ష్మీకేశవమ్మ, జెడ్పీహైస్కూల్, బాకరాపేట

గురువులకు గుర్తింపు

- జిల్లావ్యాప్తంగా ఏడుగురికి రాష్ట్రస్థాయి అవార్డులు
- నేడు విజయవాడలో అవార్డులు ప్రదానం

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు వైఎస్సార్ జిల్లా నుంచి ఏడుగురు ఎంపికయ్యారు. ఇందులో యోగివేమన యూనివర్సిటీ నుంచి డిపార్టుమెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ బయోఇన్ఫర్మాటిక్ నుంచి కె. రియాజున్నీసా, డిపార్టుమెంట్ ఆఫ్ కెమిస్ట్రీ నుంచి కేఎస్‌వీ కృష్ణారావు, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నుంచి బాటనీ లెక్చరర్ ఎంవీ సురేష్‌బాబు, ఎర్రగుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి హిస్టరీ లెక్చరర్ నారాయణ ఎంపికయ్యారు. అలాగే ప్రొద్దుటూరు మండలం లింగారెడ్డి నగర్ ఎంపీపీఎస్ స్కూల్లో ఎస్‌జీటీగా పనిచేస్తున్న షేక్ జవహార్ మునీర్, ఎస్‌ఏ , కాశినాయన మండలం రెడ్డి కొట్టాల ఎంపీయూపీ స్కూల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీ పరిమళ జ్యోతి, పెండ్లిమర్రి మండలం ఎగువపల్లి జెడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ హిందీ ఉపాధ్యాయుడు ఎఫ్ఎంఎస్ ఖాదర్ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ టీచర్స్‌కు ఎంపికయ్యారు. వీరు శుక్రవారం విజయవాడ లబ్బీపేటలోని ఏ- కన్వెన్షన్ సెంటర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ చేతుల మీదుగా అవార్డులను అందుకోనున్నారు.



పరిమళ జ్యోతి



షేక్ జవహార్ మునీర్



ఎఫ్ఎంఎస్ ఖాదర్



ఎంవీ సురేష్‌బాబు



బత్తుల ఏకో నారాయణ



కేఎస్వీ కృష్ణరావు



ప్రొఫెసర్ రియాజున్నీసా

సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ) కేటగిరీ సంబంధించి...

మండలం	ఎస్‌జిటి, పనిచేసే చోటు
ప్రొద్దుటూరు	ఏవీసుచిత్రకుమారి, ఎంపీపీఎస్, విరాట్‌నగర్
చాపాడు	క్రిష్ణయ్య ఎంపీపీఎస్, నక్కలదిన్నె
ఒంటిమిట్ట	శివ రామక్రిష్ణంరాజు జెడ్పీహైస్కూల్, పెనగలూరు
బి కోడూరు	శ్రీనివాసులు ఎంపీపీఎస్, అయ్యవారిపల్లె, హెచ్‌డబ్లూ
కాశినాయన	ఖాశీంవల్లి ఎంపీపీఎస్, బాలాయపల్లె
పెండ్లిమర్రి	సుహాసిని, ఎంపీపీఎస్, మర్రిమాకులపల్లె
చక్రాయపేట	భాస్కర్‌రెడ్డి, ఎంపీపీఎస్, తిమ్మారెడ్డిపల్లె
బి. కోడూరు	రామక్రిష్ణారెడ్డి, ఎంపీపీఎస్, ఆతిత్యారాంపేట
పోరుమామిళ్ల	ఆదిశేషారెడ్డి, ఎంపీపీఎస్, రంగసాపురం, హెచ్‌డబ్లూ
పోరుమామిళ్ల	వెంకటసుబ్బన్న, ఎంపీపీఎస్, సురుసిద్దపల్లె
చెన్నూరు	దస్తగిరి, ఎంపీపీఎస్, రాచినాయపల్లె
చెన్నూరు	రాజారావు, ఎంపీపీఎస్, దౌలతాపురం, ఎస్టీసి
కలసపాడు	వీరారెడ్డి, ఎంపీపీఎస్, గంగాయపల్లె
పోరుమామిళ్ల	గురవయ్య, ఎంపీపీఎస్, రంగసాపురం, హెచ్‌డబ్లూ
ఒంటిమిట్ట	ఆర్‌వి సౌభాగ్య ఎంపీయూపీఎస్, సికొత్తపల్లి
కాశినాయన	రాధిక, ఎంపీపీఎస్, రెడ్డి కొట్టాల
కడప	మేరీ సువర్ణ, ఎంపీపీఎస్, రామరాజుపల్లె
పోరుమామిళ్ల	శ్రీనివాసులు, ఎంపీపీఎస్, కొత్రపాటిపల్లి
ప్రొద్దుటూరు	పెంచలయ్య, ఎంపిఎల్, పిఎస్ ప్రొద్దుటూరు
ఒంటిమిట్ట	ప్రభు భూషణ, ఎంపీపీఎస్, చింతరాజుపాలెం
ప్రొద్దుటూరు	గాయత్రి, ఎంపీపీఎస్, కాకిరేణిపల్లె
పోరుమామిళ్ల	ఈశ్వరరావు, ఎంపీపీఎస్, రాజాశాబ్‌పేట
వేంపల్లి	సుదర్శన్, ఎంపీపీఎస్, బక్కన్నగారిపల్లె
కలసపాడు	యస్వీ సత్యనారాయణ, ఎంపీపీఎస్, పుల్లారెడ్డిపల్లె
సీకేదిన్నె	రహీంబాష, జెడ్పీహైస్కూల్, ఉర్దూ, అంగడివీధి
చెన్నూరు	ఫాతిమా సుల్తానా, ఎంపియూపీఎస్, కొండపేట
మైదుకూరు	అబిదున్నీషా బేగం, ఎంపీపీఎస్, షాపూర్
వేంపల్లి	ఫరిదాబాను, ఎంపిఎస్ ఉర్దూ, మెయిన్, వేంపల్లి

క్లుప్తంగా

చైన్ స్నాచింగ్

వీరపునాయునిపల్లి : మండలంలోని మొయిళ్ల చెరువు గ్రామానికి చెందిన ఇద్దరు మహిళల వద్ద గుర్తు తెలియని వ్యక్తులు 5తులాలు బంగారు నగలు చోరీ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మొయిళ్లచెరువుకు చెందిన లింగాల పార్వతి, కంబం రమాదేవి తమ వ్యక్తిగత పనుల మీద వీరపునాయునిపల్లెకు వచ్చి ముగించుకొని తిరుగు ప్రయాణంలో రామిరెడ్డిపల్లె నుంచి నడుచుకొంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో వారిని వెంబడించి కత్తులు చూపించి బెదిరించి వారి మెడలోని బంగారు నగలను లాక్కొని వెళ్లడం జరిగిందని ఏఎస్ఐ రామచంద్ర తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


చింతల రమణ మృతదేహం

చాపాడు : మండలంలోని పల్లవోలు గ్రామంలో బుధవారం రాత్రి చింతల రమణ (32) అనే వ్యక్తి ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. పల్లవోలుకు చెందిన చింతల రమణ నాలుగేళ్ల క్రితం మిడుతూరుకు చెందిన ప్రసన్న అనే యువతిని వివాహం చేసుకున్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా మూడు నెలల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో బుధవారం రాత్రి మనస్తాపం చెందిన రమణ ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రమణకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బంగారు గొలుసు దొంగ అరెస్ట్


స్వాధీనం చేసుకున్న బంగారు చైన్

కడప అర్బన్ : కడప నగర చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవుని కడప ఆర్చి సమీపంలో.. కడప నగరం చిన్న చౌక్ ఏరియాలో నివసిస్తూ, గొలుసు దొంగతనానికి పాల్పడిన పడుచూరి కిషోర్ కుమార్‌ను చిన్న చౌక్ సీఐ ఓబులేసు, ఎస్సైలు రాజరాజేశ్వర్ రెడ్డి, రవి కుమార్ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. అతను వద్ద నుంచి రూ. లక్ష విలువ చేసే 16.50 గ్రాముల బంగారు చైన్‌ను స్వాధీనం చేసుకుని, సీజ్ చేశారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన సీఐ, ఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్ శివకుమార్, కానిస్టేబుళ్లు ఖాదర్ హుస్సేన్, ప్రదీప్ కుమార్, సుధాకర్ యాదవ్, మాధవరెడ్డి, నాగరాజును కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ప్రశంసించి రివార్డుల కోసం సిఫార్సు చేశారు.

ముంచుకొస్తున్న సోమశిల ముంపు జలాలు

- సగిలేరు లోలెవల్ వంతెనపైకి వచ్చే ప్రమాదం
- నిలిచిపోనున్న ఆరు పంచాయతీల రాకపోకలు
- ఆందోళనలో ఆయా గ్రామాల ప్రజలు


సగిలేరు నది లోలెవల్ వంతెన లెవల్‌కు చేరిన సోమశిల ముంపు జలాలు


వంతెన పైకి నీరు చేరడంతో ప్రమాదం అంచున వెళుతున్న ప్రజలు(ఫైల్)

అట్లూరు : పెన్నా నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో.. సోమశిల జలాశయంలో రోజు రోజుకు నీరు పెరుగుతోంది. దీంతో అట్లూరు మండల పరిధిలోని సగిలేరు నదికి భారీగా జలాలు వస్తున్నాయి. వేమలూరు దగ్గర సగిలేరు నదిపై ఉన్న లోలెవల్ వంతెన పైకి సోమశిల వెనుక జలాలు నేడో రేపో చేరనున్నాయి. సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 78 టీఎంసీలు కాగా.. శుక్రవారానికి 66 టీఎంసీలకు చేరుకున్నాయి. పెన్నానది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో సోమశిల జలాశయంలోకి రోజూ 23.500 కూసెక్కుల నీరు చేరుతోంది. దిగువకు 12 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మిగిలిన 10 వేల పైచిలుకు క్యూసెక్కుల నీరు జలాశయంలో చేరుతుంది. దీంతో రోజుకు ఒక టీఎంసీ నీరు నిల్వ చేరుతుంది. ఈ ఉధృతి ఇలాగే కొనసాగి అధికారులు ఇలాగే నీటిని నిల్వ చేస్తే.. మరో వారం రోజుల లోపే పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకుంటుంది. శుక్రవారానికి లోలెవల్ వంతెన లెవల్‌కు నీరు చేరింది. ఒక టీఎంసీకి అడుగు మేర నీరు వస్తుంది. ఇలాగే కొనసాగితే రెండు లేదా మూడు రోజులకు వేమలూరు వద్ద ఉన్న లోలెవల్ వంతెనపై రాకపోకలు పూర్తిగా నిలిచి పోతాయి.

మండల కేంద్రానికి 40 కిలో మీటర్లు తిరిగి వెళ్లాలి

అట్లూరు మండల పరిధిలో 12 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. సగిలేరు నదికి తూర్పున ఆరు, పడమర ఆరు పంచాయతీలు ఉన్నాయి. లోలెవల్ వంతెనపై నీరు రెండు లేదా మూడు అడుగుల మేర చేరితే వాహన రాకపోకలు పూర్తిగా నిలిచి పోతాయి. రాకపోకలు నిలిచిపోతే అట్లూరులో ఉన్న తహసీల్దారు, ఎంపీడీఓ, వెలుగు తదితర మండల కార్యాలయాలతోపాటు పోలీస్‌స్టేషన్, బ్యాంకులకు వెళ్లాలంటే బద్వేలు మీదుగా 40 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తుంది. సాధారణంగా ఆరు కిలోమీటర్ల దూరం వెళ్తే సరిపోతుంది. ఈ పరిస్థితి సగిలేరు నదికి తూర్పు భాగాన ఉన్న ముత్తుకూరు, వేమలూరు, కామసముద్రం, మాడపూరు, మణ్యవారిపల్లి, కమలకూరు గ్రామ పంచాయతీల పరిధిలోని సుమారు 30 గ్రామాలకు నెలకొంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సగిలేరు నదిపై హైలెవల్ వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

హైలెవల్ వంతెన నిర్మించాలి



సోమశిల జలాశయంలో నీరు పూర్తి స్థాయిలో నిల్వ చేసిన ప్రతి సారి మాకు అవస్థలు తప్పడం లేదు. ఎక్కడెక్కడో కోట్లు వృథాగా ప్రభుత్వాలు ఖర్చు చేస్తున్నాయి. మా ఆరు పంచాయతీల ప్రజల అవస్థలు ప్రభుత్వాలకు కనిపించడం లేదు. ఇకనైనా సగిలేరు నదిపై హైలెవల్ వంతెన నిర్మించాలి.

– చిన్న మునిరెడ్డి, పెద్దకామసముద్రం గ్రామం, అట్లూరు మండలం

మా అవస్థలు ఇంకెన్నాళ్లు



ప్రతి సంవత్సరం సోమశిల ప్రాజెక్టుకు నీరు వచ్చినప్పుడల్లా సగిలేరు నదిపై ఉన్న వంతెన మునగడం, మాకు రాక పోకలు నిలిచి పోవడం మామూలైంది. మా ఆరు పంచాయతీ గ్రామాల ప్రజలు అవస్థలు అధికారులకు పట్టడం లేదు. మేము ఇంకెన్నాళ్లు భరించాలి.

– రాజవోలు సుబ్బారెడ్డి, కామసముద్రం, మండల ఉపాధ్యక్షుడు

టెండర్లకు ఎవరూ ముందుకు రాలేదు



మూడేళ్ల క్రితం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టరు సుధా తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి రూ.20 కోట్ల నిధులు కేటాయించారు. సర్వే చేయించారు. అయితే ఎక్కువ రోజులు నీరు ఉంటుందని ఇక్కడ వంతెన నిర్మాణానికి ఇబ్బందికరంగా ఉంటుందని టెండర్లకు ఎవరూ ముందుకు రాలేదు.

– ముదమాల ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్

ఉత్సాహంగా ఏసీఏ అండర్–23 మల్టీ డే మ్యాచ్‌లు


విజయ్‌రామిరెడ్డి, 80 పరుగులు(కడప)


కనిష్, 4 వికెట్లు (కర్నూలు)


ఇకాక్షర్, 5 వికెట్లు(నెల్లూరు)


పవన్‌కుమార్, 83 పరుగులు(నెల్లూరు)

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్–23 మల్టీ డే మ్యాచ్‌లు రెండవ రోజు ఉత్సాహంగా కొనసాగాయి. వైఎస్ఆర్ఆర్ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో 304 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో మ్యాచ్‌ను ప్రారంభించిన కడప జట్టు 88.4 ఓవర్లకు 9 వికెట్లు కోల్పోయి 374 పరుగులు చేసింది. ఆ జట్టులోని విజయ్ రామిరెడ్డి 80, భరత్‌రెడ్డి 37 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని కనిష్ 4, అక్షిత్‌రెడ్డి 3 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 65 ఓవర్లకు 9 వికెట్లు కోల్పోయి 261 పరుగులు చేసింది. ఆ జట్టులోని సాయిసూర్యతేజరెడ్డి 58, అక్షిత్‌రెడ్డి 47, సాయి ప్రణవ్ 51 పరుగులు చేశారు. కడప జట్టులోని చెన్నారెడ్డి 3, ఎస్ఎండీ అయాబ్ 2 వికెట్లు తీశారు. కర్నూలు జట్టు 113 పరుగుల వెనుకంజలో ఉంది.

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో..

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో 196 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో రెండవ రోజు బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 43.3 ఓవర్లలో 242 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని వెంకట్ లోకేష్ 30 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని ఇకాక్షర్ అద్భుతంగా బౌలింగ్ చేసి 5 వికెట్లు తీశాడు. నారాయణ 3, మాధవ్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 60 ఓవర్లకు 350 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఆ జట్టులోని రోషన్ పవన్‌కుమార్ 83 పరుగులు, సూతేజ్‌రెడ్డి 81 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని ప్రమోద్ 3 వికెట్లు, టీవీ సాయి ప్రతాప్‌రెడ్డి 4 వికెట్లు తీశారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 3 ఓవర్లకు తొలి వికెట్ కోల్పోయి 14 పరుగులు చేసింది. దీంతో రెండవ రోజు ఆట ముగిసింది.

లోకేష్ వ్యాఖ్యలు నీచరాజకీయాలకు పరాకాష్ట

వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆర్.వెంకటసుబ్బారెడ్డి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బారెడ్డి

కడప కార్పొరేషన్ : రాష్ట్ర విద్య, ఐటీ శాఖామంత్రి నారా లోకేష్ వ్యాఖ్యలు నీచరాజయాలకు పరాకాష్ట అని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆర్.వెంకటసుబ్బారెడ్డి ధ్వజమెత్తారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి రోజు తన తల్లి విజయమ్మను వైఎస్ఆర్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పలకరించలేదని మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించడం విష ప్రచారానికి పరాకాష్ట అన్నారు. విషం చిమ్మడంలో లోకేష్ గోబెల్స్‌నే మించిపోయారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ వర్ధంతి రోజు తాను విజయమ్మ పక్కనే ఉన్నానని, వైఎస్ విజయమ్మను జగన్ ఆప్యాయంగా పలకరించడం అందరూ చూశారని, ఆ దృశ్యాలు అన్ని టీవీల్లోనూ ప్రసారం అయ్యాయన్నారు. కళ్లుండి లోకేష్ చూడలేకపోవడం దురదృష్టకరమన్నారు. పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల్లో స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకున్నామని టీడీపీ ఓటర్లు చెప్పడం ఎంత అబద్ధమో, వైఎస్ జగన్‌ను కలిసేందుకు పాసులు ఇచ్చారని లోకేష్ విషం చిమ్మడం కూడా అంతే అబద్ధమన్నారు. మీ చిన్నాన్న నారా రామ్మూర్తి నాయుడు కాంగ్రెస్ పార్టీలో ఎందుకు చేరారో లోకేష్ సమాధానం చెప్పాలని రెడ్యం సవాల్ విసిరారు. నాడు వ్యవసాయం దండగ అన్న నారా చంద్రబాబు నాయుడు నేడు యూరియా ఎక్కువ వాడితే క్యాన్సర్ వస్తుందని చెప్పడం హాస్యాస్పదమన్నారు. వరి ఎక్కువ పండిస్తే కొనే వారే ఉండరని చెప్పడం రైతు వ్యతిరేక చర్య అని మండిపడ్డారు. చంద్రబాబు, లోకేష్‌లు లేని వాటిని నమ్మించేందుకు శతవిధాలా ప్రయత్నించి విఫలమవుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి వై.నిరంజన్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి బి. సుబ్బరాయుడు యాదవ్ పాల్గొన్నారు.

టీడీపీకి అండగా ఉన్న బలిజలకే మోసం

- పెత్తనమంతా ఒక సామాజిక వర్గానిదే
- టీడీపీపై బలిజ సంక్షేమ సంఘం నేతల ఆగ్రహం


సమావేశంలో మాట్లాడుతున్న బలిజ సంక్షేమ సంఘం నేతలు నాగరాజు, మురళి

కడప రూరల్ : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి అండగా ఉన్న బలిజ వర్గీయులను అవమానపరచడం తగదని బలిజ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు అన్నారు. గురువారం స్థానిక హరి టవర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో 27 శాతం మంది బలిజ వర్గీయులు ఉన్నారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి తామంతా అండగా నిలిచామన్నారు. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం రావడానికి బలిజలు కృషి చేశారని పేర్కొన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక బలిజలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. జిల్లాలో పార్టీ కోసం పని చేసిన హరిప్రసాద్‌కు నామమాత్రంగా డైరెక్టర్ పదవిని ఇచ్చి బలిజలను అవమానపరిచారని తెలిపారు. బలిజలకు టీడీపీ ఎందుకు గుర్తింపు ఇవ్వలేదో అధిష్టానానికే ఎరుక అని పేర్కొన్నారు. రాయలసీమ బలిజ సంఘం నాయకులు చెన్నంశెట్టి మురళి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో పెత్తనమంతా ఒక సామాజిక వర్గానిదే సాగుతోందన్నారు. బలిజలకు మాత్రం తీవ్ర అన్యాయం జరుగుతోందని తెలిపారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు బలిజ భవన్‌ను పూర్తి చేస్తామని హామీ ఇచ్చి మరిచారన్నారు. టీడీపీ సిద్ధాంతం కోసం మా వాళ్లంతా కష్టపడితే, ఆ పార్టీ అధిష్టానం తమకు ఏ మాత్రం న్యాయం చేయలేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎంపీ కృషితో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రయాణికుల సౌకర్యార్థం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వినతి మేరకు జిల్లాలోని కొండాపురం, ఎర్రగుంట్ల స్టేషన్లలో కొత్తగా రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పూణె–కన్యాకుమారి–పూణె (16381/82) మధ్య తిరుగుతున్న కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ రైలు కొండాపురం స్టేషన్‌లో ఆగనుంది. 16381 నంబరు గల రైలు పూణె నుంచి కన్యాకుమారికి వెళుతూ ఉదయం 11.22 గంటలకు కొండాపురం చేరుకుని నిమిషం పాటు ఆగుతుంది. అలాగే 16382 నంబరు గల రైలు కన్యాకుమారి నుంచి పూణెకు వెళుతూ రాత్రి 7.29 గంటలకు కొండాపురానికి చేరుకుని నిమిషం పాటు ఆగుతుంది. అలాగే 17622 నంబరు గల తిరుపతి–ఔరంగబాద్ రైలుకు ఎర్రగుంట్లలో స్టాపింగ్ కల్పించారు. ఈ రైలు మధ్యాహ్నం 1.24 గంటలకు ఎర్రగుంట్లకు చేరుకుని నిమిషం పాటు ఆగనుంది. ఈ విషయంగా ఆయా ప్రాంతాల ప్రయాణికులు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి మాస కల్యాణం


స్వామి, అమ్మవారి కల్యాణంలో పాల్గొన్న మఠం నిర్వాహకులు

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలో గురువారం శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి మాస కల్యాణం ఘనంగా నిర్వహించారు. పూర్వపు మఠాధిపతి వీరభోగ వసంత వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో రెండవ మాసం కల్యాణం మఠం ఆస్థాన ప్రధాన అర్చకుడు ఇడమటికంటి జనార్ధనాచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామి వారి శిష్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించి తన్మయులయ్యారు. ప్రతి నెల శుద్ధ ద్వాదశి నాడు దాతల సహకారంతో స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వపు మఠాధిపతి పెద్దకుమారుడు వెంకటాద్రిస్వామి, మఠం మేనేజర్ ఈశ్వరాచారి, పూజారులు, దాతలు పాల్గొన్నారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు అర్హత పరీక్ష

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో సివిల్స్ ఉచిత శిక్షణకు అర్హత పరీక్ష నిర్వహించినట్లు డైరెక్టర్ ఏవీఎస్ కుమార స్వామి గుప్తా తెలిపారు. యూపీఎస్సీ సివిల్స్ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు తన ఫౌండేషన్ ద్వారా ఉచిత శిక్షణ, ఫెలోషిప్ అందించడానికి ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఉన్నత విద్య, పోటీ పరీక్షల విభాగపు అధికారి డాక్టర్ డి.కోనప్ప ఆధ్వర్యంలో గురువారం అర్హత పరీక్ష నిర్వహించారు. ఇందులో 85 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ మాట్లాడుతూ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో కోనం సందీప్ అనే పూర్వ విద్యార్థి 2015లో ఇంజినీరింగ్ విద్య పూర్తి చేసి, తన స్వశక్తితో హైదరాబాద్‌లో కోనం ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఎంతో మంది పేద విద్యార్థులకు ఉచిత విద్య, సాఫ్ట్‌వేర్ రంగంలో కొలువులు ఏర్పాటు చేస్తూ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ఈ తరుణంలో ఆర్జీయూకేటీ పోటీ పరీక్షల విభాగం ఆ సంస్థను సంప్రదించి విశ్వవిద్యాలయంలో చాలా మంది విద్యార్థులు సివిల్స్ పరీక్ష శిక్షణ కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సివిల్స్‌కి సన్నద్ధమయ్యే ఆర్జీయూకేటీ విద్యార్థులకు సాయం అందించాలని పూర్వపు విద్యార్థి కోనం సందీప్‌ను కోరినట్లు చెప్పారు. తాను చదువుకున్న విశ్వవిద్యాలయం కోసం తన వంతుగా సాయం చేస్తానన్నారని వివరించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులై మెరిట్‌లో ఎంపికైన వారికి కోనం స్వచ్ఛంద సంస్థ తరఫున ఉచిత శిక్షణతోపాటు ఫెలోషిప్ అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవో డాక్టర్ పెనుకొండ రవికుమార్, డీన్ ఆఫ్ అకాడమిక్ రమేష్ కైలాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండను తవ్వేశారు..!

- రోడ్డు నిర్మాణం కోసం గ్రావెల్ తరలింపు
- అనుమతులు లేకుండానే తవ్వకాలు
- చర్యలు చేపడుతామంటున్న మైనింగ్ అధికారులు


గ్రావెల్ కోసం కొండను తవ్విన దృశ్యం

జమ్మలమడుగు : జాతీయ రహదారి నిర్మాణం కోసం ఎస్ఆర్‌సీ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఏకంగా కొండను తవ్వేసింది. పైసా ఖర్చు లేకుండా.. రెవెన్యూ, మైనింగ్ అధికారుల అనుమతులు లేకుండా.. ఏకంగా 22 కిలోమీటర్ల దూరం రోడ్డ నిర్మాణం కోసం గ్రావెల్ వాడుకుంది. మండల పరిధి అంబవరం పంచాయతీలోని కొత్త గుంటపల్లె సమీపంలో ఎస్ఆర్‌సీ కంపెనీ ప్రకృతి వనరులైన కొండలను నాశనం చేసింది. దాదాపు 30 నుంచి 40 ఎకరాల్లో ఉన్న కొండ ప్రాంతాన్ని 30 అడుగుల మేర ఇటాచీలతో తవ్వి కొల్లగొట్టారు. ఈ విషయంపై సాక్షి దినపత్రికలో «కొండను కొల్లగొట్టి.. రహదారి పనులు చేపట్టి» అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీంతో మైనింగ్ అధికారులు స్పందించారు. ఈ ప్రాంతాన్ని మైనింగ్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పరిశీలించబోతున్నారు.

చర్యలు ఉంటాయా.. లేదా?

జాతీయ రహదారి నిర్మాణం కోసం వాడే గ్రావెల్‌కు క్యూబిక్ మీటర్‌కు 700 నుంచి 1000 రూపాయలు వసూలు చేస్తారు. ఎస్ఆర్‌సీ కంపెనీ ప్రతినిధులు తమకు పది వేల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ అవసరం ఉందంటూ, దానికి అనుమతులు ఇవ్వాలంటూ తహసీల్దార్‌కు లెటర్ ఇచ్చారు. అయితే అనుమతులు లేకుండానే ఏకంగా పది వేల క్యూబిక్ మీటర్ల కంటే ఎక్కువగా గ్రావెల్‌ను రోడ్డు నిర్మాణం కోసం ఉపయోగించినట్లు రెవెన్యూ అధికారులు చర్చించుకుంటున్నారు. పైగా వార్త రావడంతో ఏమి చేయాలో పాలుపోక మల్లగుల్లాలు పడుతున్నారు. జాతీయ రహదారి అధికారుల లెక్కల ప్రకారం రెండు కోట్ల కంటె ఎక్కువగా గ్రావెల్‌కు ఖర్చు అవుతుందని తెలుపుతున్నారు. ఈ డబ్బు అంతా కాంట్రాక్టర్ మిగిలించుకునే పనిలో పడ్డారు. ప్రస్తుతం అక్రమ మైనింగ్‌పై తమకు ఫిర్యాదు అందిందని జిల్లా మైనింగ్ అధికారి రాధా తెలిపారు. దీనిపై విచారణ కోసం మైనింగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు లేఖ పంపించామని పేర్కొన్నారు. మరి మైనింగ్ అధికారులు అక్రమ మైనింగ్ పైన చర్యలు తీసుకుని, దానికి సంబంధించిన పరిహారం వసూలు చేస్తారో.. మరి కాంట్రాక్టర్, కంపెనీ, అధికార పార్టీకి దాసోహం అని తూతూ మంత్రంగా చర్యలు చేపడుతారో వేచి చూడాల్సిందే.

జూదరుల అరెస్ట్

కడప అర్బన్ : కడప తాలూకా పీఎస్ పరిధిలోని నబీకోటలో గురువారం జూదం ఆడుతున్న 8 మందిని అరెస్ట్ చేసి రూ.2,01,320 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తాలూకా సీఐ టి.రెడ్డెప్ప తెలిపారు. నబీకోటలోని ఓ ఇంటిలో జూద మాడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించి అరెస్ట్ చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, గ్యాంబ్లింగ్, క్రికెట్ బెట్టింగ్ తదితర వాటిపై ప్రజలు డయల్ 112 కు సమాచారమివ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని మృతదేహాలు




కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో చికిత్స కోసం వచ్చిన ఇద్దరు వేరువేరు గుర్తు తెలియని మహిళలు ఈనెల 2, 3 తేదీలలో మృతి చెందారు. ఇద్దరి మృతదేహాలను మార్చురీలో వుంచారు. వీరి ఆచూకీ తెలిసిన వారు ఆధారాలతో తమను సంప్రదించాలని రిమ్స్ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

రికార్డు ధర పలికిన గణేష్ లడ్డూ


గణేష్ లడ్డూను దక్కించుకున్న విజయ్ కుటుంబ సభ్యులు

పులివెందుల టౌన్ : పులివెందులలో వినాయక స్వామి లడ్డూ రికార్డు ధర పలికింది. పట్టణ పరిధి మైత్రి లేఔట్‌లోని మండపంలో ఏర్పాటు చేసిన అభీష్ట మహాగణపతి లడ్డూకు గురువారం వేలం పాట నిర్వహించారు. వైష్ణ కన్‌స్ట్రక్షన్స్ అధినేత విజయ్‌కుమార్ అలియాస్ పాల విజయ్ రూ.10.05 లక్షలకు పాట పాడి దక్కించుకున్నారు. అలాగే స్వామివారి కలశాన్ని మంజునాథరెడ్డి రూ.4.10 లక్షలకు పొందారు. వారిని శాలువాలతో సత్కరించి ఊరేగింపుగా వారి ఇళ్లకు వద్దకు నిర్వాహకులు తీసుకెళ్లారు.

13న జాతీయ లోక్ అదాలత్


జిల్లా ప్రధాన న్యాయ మూర్తి సి.యామిని

కడప అర్బన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా ఈనెల 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ సి.యామిని తెలిపారు. లోక్ అదాలత్‌పై గురువారం బ్యాంక్ అధికారులు, చిట్‌ఫండ్ కంపెనీ, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, న్యాయవాదులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్లతో సమీక్ష నిర్వహించారు. అనంతరం వర్చువల్ పద్ధతిలో న్యాయమూర్తులతో లోక్ అదాలత్‌పై చర్చించారు.

యుటిలిటీ పైపుల ఎత్తు పెంపు


భూమికి ఎత్తులో ఏర్పాటు చేస్తున్న యుటిలిటీ పైపులు

చాపాడు : మండల పరిధిలోని సోమాపురం వద్ద గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి కింద వేసిన యుటిలిటీ పైపుల ద్వారా కొంత మంది అక్రమంగా వ్యవసాయ నీటి కోసం వాడుతూ తమ పొలాలకు మాత్రమే నీరు మళ్లించే ప్రయత్నం చేయడంతో సంబంధిత అధికారులు గురువారం ఎత్తు పెంచారు. గ్రామానికి చెందిన పలువురు రైతులు హైవే అథారిటీ అధికారులకు చేసిన ఫిర్యాదుతో స్పందించిన జాతీయ రహదారి సంస్థ అధికారులు యుటిలిటీ పైపులను ఎత్తు పెంచారు. ఈ పైపుల ద్వారా నీరు ప్రవహించే అవకాశం లేకుండా చర్యలు చేపట్టారు. భవిష్యత్తులో వివిధ ప్రభుత్వ పరమైన అవసరాలకు అనుగుణంగా యుటిలిటీ పైపులు ఏర్పాటు చేశారు. నేషనల్ హైవే అధికారుల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని పలువురు రైతులు పేర్కొన్నారు.

ఆర్‌ఎంపీ క్లినిక్‌లు సీజ్


ఆర్‌ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేస్తున్న వైద్యాధికారిణి, సిబ్బంది

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా సి.సురేష్‌నాయుడు, శేషవర్ధన్‌లు నడుపుతున్న ఆర్‌ఎంపీల క్లినిక్‌లను సీజ్ చేసినట్లు చిలంకూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి సాయిచరితారెడ్డి గురువారం తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టరు నాగరాజు ఆదేశాల మేరకు ఆర్‌ఎంపీలు నడుపుతున్న క్లినిక్‌లను తనిఖీ చేసి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో వాటిని సీజ్ చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.